# ఓడిపోలేదు

నాకు లేని అలవాట్లు రెండే రెండు!

ఒకటి మందుధ్యాస! — రెండు ఆడగాలి!

నా ఫ్రెండ్సు నన్ను తమాషాగా కామెంట్ చేస్తూంటారు.

వాటిని కాంప్లిమెంట్సుగా భావించే స్వభావం నాది.

నన్నంతా ఏకపత్నీవ్రతుడని (తెల్సిన వాళ్ళూ - ఫ్రెండ్సు) పిలవటం పరిపాటి.

ఏదైనా పార్టీలో కూర్చుంటే - నా చుట్టూ వున్న ఫ్రెండ్సు "ఛీర్సు" చెప్పేసుకుని "సిప్పు" మీద "సిప్పయి" లాగిస్తుంటే నిగ్రహించుకోగల శక్తి నాకుంది. చిప్సో - జీడి పప్పో తింటూ కూర్చుంటాను నేను!

పదేళ్ళ సర్వీసు తర్వాత తలవని తలంపుగా నాకు ప్రమోషనొచ్చింది. పిల్లా జల్లా లేని నాకు ఫలానా వూరే కావాలని భీష్మించు కూర్చోనందువల్ల చాలా దూరం విసిరేయబడటం జరిగింది.

జీతంతోబాటు హోదా కూడా పెరిగింది.

నాకు ప్రమోషన్ రావటం శ్రీమతికి బొత్తిగా ఇష్టంలేదు.

అందుక్కారణం — నెలకి ఇరవై రోజులు కేంపుల పేరుతో ఇంటిపట్టున వుండకుండా ఆవూరూ ఈవూరూ తిరగాల్సి వస్తుందనీ హోటలు భోజనం సరిపడక ఆరోగ్యం దెబ్బతింటుందనీ!!

పై రెంటికీ మించిన కారణం మరొకటుంది.

కేంపులు వెడుతూంటే — ఇంటి ధ్యాస తగ్గిపోవటమే కాకుండా పెడదారులు పట్టేందుకు అవకాశం ఆస్కారం వుంటుందనీను!

అది కేవలం శ్రీమతి అపోహ మాత్రమే కాదు.

అందుక్కావలసిన ఋజువులు — తార్కాణాలూ అనేకం ఆమె దృష్టిలో వున్నయ్.

ఎవరోదాకా ఎందుకు? — నా బావమరిది ఆడిటరు. వాడి కేసే ఉదాహరణగా తీసుకుంది.

"మా తమ్ముడు పాడై పోవటానికి కారణం ఈ దిక్కు-మాలిన కేంపులేగా! - బంగారంలాంటి భార్యని ఏలుకోకుండా చెడు తిరుగుళ్ళు మరిగి బరితెగించి పోయాడు - వాడి సంగతి కళ్ళారాచూస్తూ మీ కీ ప్రమోషనొచ్చిందంటే బాధగా వుంది- " అనేసింది శ్రీమతి.

ఆమె మాటల్లోని అంతరార్థం - నిబిడీకృతమైన బాధ నేను పసికట్టక పోలేదు.

"అది మీ తమ్ముడి బలహీనత! చుట్టూ చేరిన గ్రహాలూ అందుక్కారణం! కానీ ఉద్యోగరీత్యా కేంపుకెళ్ళే ప్రతిమగాడూ అదేవిధంగా వుంటాడూ అంటే నేనన్నమ్మను.." నచ్చచెప్పే ప్రయత్నంలో అన్నాను.

"మీరు వెళ్ళేక వారం తిరక్కముందే కొంప ఏదైనా చూచి నన్ను వెంటనే తీసుకెళ్ళాలి! లేకపోతే వూరుకునేది లేదు..." అల్టిమేటమ్ లాంటిది జారీచేసింది.

అంటే నా అలవాట్లపట్లా మనస్తత్వం మీద శ్రీమతిలో నమ్మకం లేక కాదు - ఎంతైనా ఆడది కదా? ఆమె అంతరాంతరాల్లో పీకుతున్న బలహీనతను వ్యక్తం చేసింది అంతే! !

అందుకు నాలో నేనే నవ్వుకున్నాను.

ప్రమోషనొచ్చినందుకు ఒక వైపు సంతోషమూ, కొన్నేళ్ళుగా వుంటున్న వూరునూ, మిత్రులనూ వదలి వెళ్ళి

పోవాల్సి వస్తోందే అన్న విచారమూ నాలో చోటుచేసు కుంది.

పెళ్ళయిన ఆడపిల్ల అత్త వారింటికి వెళ్ళకా తప్పదు. ఉద్యోగంచేసే మగాడు బదిలీమీద వూరూరూ తిరక్కా తప్పదు అనేసి నన్ను నేను సముదాయించు కున్నాను.

* * * *

తిరుపతి పల్లెటూ రేమీ కాదు!

పల్లెకీ పట్నానికీ మధ్యతరహా లాంటి వూరు!!

అయినా యాత్రాస్థలం కావటం మూలాన ఆ ఏడు కొండల వాడి సహాయ సంపదల ద్వారా వనకూడిన ఆర్థిక వనరుల దృష్ట్యా వూరంతా సిమెంటు రోడ్లే!

సిమెంటు రోడ్లంటే నాకు అపరిమితమైన లైకింగ్. కాళ్ళకి చెప్పు లేకుండా నైనా నడవాలనిపిస్తుంది. వంటికి గుడ్డల్లేకుండా సిమెంట్ రోడ్డు మీద పడుకుని దొర్లా లనిపిస్తుంది. ఇంటికన్నా నాదృష్టిలో సిమెంటు రోడ్డే శుభ్రంగా వుంటుంది.

ఊరూ, మనుష్యులూ ఎట్లా వున్నా సిమెంటు రోడ్లు, మనుష్యుల సందడీ రొద చేసుకుంటూ వూరి మధ్యలోంచి కొండ కెళ్ళే బస్సులూ నన్నాకర్షించాయి.

ఊరు కొత్త కావటంవల్ల ఏమీ తోచక పోవటంతో

వచ్చిన మొదటి రోజే కొండకెళ్ళి స్వామివారి దర్శనం చేసుకున్నాను.

నేను వస్తున్నానని ముందుగా తెలీటంతో మున్సిపల్ బంగళాలో ప్రస్తుతం నాకు విడిది ఏర్పాట్లు జరిగాయి.

రోజుకి పది రూపాయల అద్దె పోతే పోయింది గానీ — బంగళాలో రూమ్ మాత్రం లక్షణంగా వుంది. రెండు డన్లప్ పిల్లో బెడ్లూ, ఎటాచ్డ్ బాత్ రూమూ, ఫర్నిచరూ, ఫేనూ అటు బస్టాండుకీ ఇటు రైల్వేస్టేషనుకీ అందుబాటులో వుంది.

ఆఫీసు ప్యూను రామకోటి అఖండుడులా అగుపించాడు. ఆవులిస్తే పేగులు లెక్కపెట్టే వాడిలా తోచింది.

మొదటి రోజున నా దగ్గరకు రావటానికే భయపడిన వాడు రెండో రోజు మీాల్సు కేరేజీ పట్టుకొచ్చి "భోజనం అయ్యాక ఆకూవక్కా వేసుకోవటం ఇక్కడి వాళ్ళకు అలవాటుసార్ అందుకే తెచ్చాను" అన్నాడు చొరవ చేసుకు మాట్లాడాలని ప్రయత్నిస్తూ.

వాడి మాట తీరు నన్నాకర్షించింది. వంటరితనమే కాకుండా కొత్తప్రదేశం కావటం మూలాన రూమ్‌లో పడుకుంటే నిద్రపట్టి చచ్చేది కాదు.

ప్రక్క గదుల్లోకి వచ్చేపోయే వారి హడావుడి అక్కడి వాతావరణం నన్ను ఇబ్బంది పెట్టసాగేయి.

నా ముఖ కవళికలు, మనసులో ఆలోచనా పసికట్టిన రామకోటి "ఇది ఇక్కడ మామూలే సార్" అనేసి వెకిలిగా నవ్వేడు.

ప్రశ్నార్థకంగా వాడి ముఖంలోకి చూచాను.

"ఇది యాత్రా స్థలమే అయినా ఇక్కడ అన్నీ దొరుకుతాయ్..."

రామకోటి 'అన్నీ' అనే మాటను నొక్కి పలకటం నాలో ఆశ్చర్యాన్ని కలిగించింది.

తిరుపతి దేవుడి మీద ఊరి మీద నాకో పవిత్రమైన అభిప్రాయం వుంది.

"తమిళనాడులో ప్రొహిబిషనుంది సార్. అంచేత అరవ్వాళ్ళు యాత్రకొచ్చి దర్శనం ముగించుకున్నాక పూటుగా తాగేసి రెండు రోజులు కాలక్షేపం చేసి మరీ పోతారు..."

రామకోటి మాటకి గతుక్కుమన్నాను. వాడు ధైర్యంగా చెప్పినా నాకు మాత్రం భయం వేసింది. చుట్టూ చూశాను. వాడి మాటలు ఎవ్వరికీ విన్పించనట్టే అన్పించింది.

డ్యూటీలో ఉన్నప్పుడు కూడా 'తీర్థం' పుచ్చుకున్న వాడిలాగానే అవుపిస్తున్నాడు రామకోటి.

మందులేనిదే బ్రతకలేడనే నిజం వప్పేసుకుని కాళ్ళ మీద పడ్డాడు. వాడి నిజాయితీకి నిర్ఘాంతపోయాను.

"తమరు కోప్పడనంటే ఓ మాట చెప్తాను సార్ ... ఈ రోజుల్లో తాగని ఎదవెవడు! చీకటి పడగానే నూటికి తొంభై మందికి సీసా కావాలి ... మరి కొందరికి ......" చెప్తున్న వాడల్లా నా ముఖంలో ప్రత్యక్షమైన కోపం చూచి తక్కున ఆగిపోయాడు రామకోటి.

వెలిబుచ్చిన అభిప్రాయానికి వాడి పీక పిసికి చంపేయా లన్పించింది. నన్ను నేను తమాయించుకున్నాను. వాణ్ణికొట్టే అధికారం హక్కునా కెక్కడివి?

"మీరు భోజనం చేసి పండుకోండి సార్. అన్నీ మీకే తెలుస్తయ్—" విన్పడీ విన్పడకుండా గొణిగేడు.

ఆ మాటకి అర్థమేమిటాని ఆలోచిస్తూ వుండిపోయాను.

ప్యూను వెధవకి చనువిస్తే చాలు. అవాకులు చెవా కులూ పేల్తాడు — అనేసి విసుక్కున్నాను.

అప్పటికి రాత్రి పదకొండు గంటలు దాటింది. నాకు నిద్ర రాకుండా వుంది.

"వస్తాను సార్ పొద్దుపోయింది. ఇంటి దగ్గర పెళ్ళాం పిల్లలు నా కోసం చూస్తూవుంటారు—" అనేసి వెళ్ళియాడు.

హమ్మయ్య — పీడ వదిలింది అనుకుని రూమ్‌లో కొచ్చాను. - వరండాలో వున్న కుర్చీని గదిలోకి ఈడ్చు కొచ్చాను.

రామకోటి మాటలు ఇంకా నా బుర్రలో పరిభ్రమి స్తూనే వున్నాయ్ ...

వంటరి తనం—ఆలోచన్లూ—నన్ను తికమక పెట్టసాగాయి

నిద్రలోకి ఎప్పుడు ఒరిగిపోయానో నాకే తెలీదు ... కానీ— తలుపు కొడుతున్న చప్పుడికి మెలకువ వచ్చింది.

ఆ కొట్టేది నా గది తలుపు అవునో కాదోని ఒక్క-క్షణం ఆలకించాను.

వెళ్లి తలుపు తియ్యాక తప్పలేదు.

ఒక ఆడ మనిషి వేగంగా లోపలికి దూసుకొచ్చింది.

"తలుపు వేసెయ్యండి...ప్లీజ్ ..." అంది.

"ఎవరు నువ్వు—" నా స్వరంలో వణుకు చోటు చేసుకుంది.

"మీకు పుణ్యముంటుంది. ముందు తలుపు వేయండి —" అంటూ నన్ను పక్కకు నెట్టి ఆమె గడియ పెట్టింది.

ఆమె చొరవకి చకితుణ్ణి అయ్యాను.

నేను నిల్చునే వున్నాను ... ఆమె వెళ్ళి బెడ్ మీద కూర్చుంది.

నా గుండెలో దడ ప్రారంభమైంది. పెదాలు వణక నారంభించాయి. నోట మాట రావటం లేదు.

పరాయి ఆడదంటే నాకు చచ్చేటంత భయం! నాకున్న బలహీనతల్లా అదొక్కటే.

"నేను మీకు కొత్తే అయినా — మీ గురించి నాకు అంతా తెలుసు ..." పొడి పొడిగా మాట్లాడింది.

ఈమెకు నా గురించి తెలుసా? — ఏం తెలుసా? — అసలెందు కొచ్చినట్టు? బెడ్ మీద కూర్చుని ఈ అసందర్భపు మాటు లేమిటి అన్పించింది.

ఫాన్ తిరుగుతున్నా నా వంటికి చెమట పడుతోంది.

నేనేమిటి, నా పరువేమిటి? — ఎవరైనా చూస్తే?... పోనీ... ఎవరికైనా తర్వాత తెలిస్తే.

'శ్రీరామచంద్రుడి లాంటివారు... భయ పడకండి-' నా పరిస్థితి గమనించి అన్నదా అన్పించింది.

లైటు వెలుగులో ఆమెను ఆపాద మస్తకం కళ్ళు విప్పార్చుకు చూశాను.

నడి వయస్సు, మంచి ఛాయ గల శరీరం — అందమైన అలంకరణ —

'అట్లా పురుగును చూచినట్టు చూడకండి నన్ను ...' మళ్ళీ ఆమే అంది.

నా కళ్ళను నేనే నమ్మలేని పరిస్థితి ఏర్పడుతోంది.

నా చెయ్యి పట్టుకుని దగ్గరగా లాక్కుంది.

తుళ్ళిపడ్డాను.

నా శరీరంలో ప్రవహిస్తున్న నెత్తురులో మార్పేదో వస్తున్నట్టు అనిపిస్తూంది.

తమాయించుకోవాలని నే చేస్తున్న ప్రయత్నం విఫల మౌతుందేమోననే భయం నన్ను పీక్కు తిన నారంభించింది.

"ఎందుకట్లా వణికి పోతారూ? — నేనూ మనిషినే! ప్రస్తుతం మీదాన్ని..."

నేను దిగజారి పోతున్నా అనే భయం నన్ను పీక్కు తింటోంది. ధైర్యం చెయ్యగల సాహసం నాలో దూరమవు తోంది.

ఆమె మాటలు జుగుప్సాకరంగా వున్నా... స్వరంలో మాధుర్యం ..... లాలిత్యం... అంగవిన్యాసం చూస్తుంటే తన్మయత్వంలాంటిదేదో ఆవరిస్తోంది నన్ను.

ఎందుకు దిగజారి పోతావ్? పాతాళంలో పడిపోకు... అనేసి అంతరాత్మ ఘోషిస్తోంది.

ఆమె లైటార్పేసింది.

శ్రీమతి గానీ... నిష్ఠనియమాలు గానీ...... నాకు గుర్తు రాకుండా వుండేట్లు ప్రవర్తించ నారంభించిందామె.

తియ్యని మాటలతో మరో లోకంలోకి మత్తులోకి లాక్కెడుతోంది .....

"మీరు ఋష్యశృంగులా ..."

ఆమె ప్రశ్న నన్ను కొరడాతో కొట్టి నట్టన్పించింది.

ఇన్నేళ్ళూ మడిగట్టుకు బ్రతికిన నన్ను చివరికి ఈ రోజున... ఈమె ఎవరో ముక్కూ ముఖం తెలీని మనిషి... నన్ను లొంగదీసుకుంటుందా? ... నాలో ఆవేదన బాధ ప్రవేశించింది.

ఏదో స్పర్శ...... మరేదో శక్తి ... నన్నూ నాలో వుండే మంచినీ మానవత్వాన్నీ దూరంగా తరిమేస్తోంది.

శక్తినంతా కూడగట్టుకున్నాను.

ఛీ! అనుకున్నాను!!

ఆమెను బలంగా తోశాను. బెడ్ మీదినుంచి ఆమె ధభాలున క్రిందపడ్డది.

ధైర్యాన్ని కూడతీసుకునే ప్రయత్నంలో వున్నాను.

గది తలుపు ఎవరో దబదబా బాదుతున్నారు.

ఉలిక్కిపడి లేచి బెడ్ మీద కూర్చున్నాను.

గదంతా చీకటిగా వుంది.

మళ్ళీ తలుపు కొడ్తున్న శబ్దం ... లేచివెళ్ళి కళ్ళు నలుపుకుంటూ తలుపు తీశాను.

ఎదురుగా మనిషి ఆకారం!

గదిలో లైటు వేశాను.

"నేనుసార్! రామకోటిని ... ఏమిటలా కంగారు పడుతున్నారూ..."

నన్ను నేను గిల్లి చూచుకున్నాను. గదంతా లైటు వెలుగులో కలియ చూశాను.

ఆమేదీ ... అనుకున్నాను.

రిస్ట్‌వాచీ చూచుకున్నాను. పన్నెండు గంటలు కావస్తోంది.

"వాట్ ఎ పిటీ ? కలగన్నానా? "

రామకోటి మాటలు నాలో కల్గించిన అనుభూతికీ ... ఆలోచనకూ ... నవ్వుకున్నాను.

ఏం సార్ ఏదైనా కలగన్నారా? ... నే వెళ్ళి గంటయినా కాలేదు. అప్పుడే నిద్ర పట్టిందా మీకు — అన్నం తినేసి ఇప్పుడే వస్తున్నాను మీకు తోడుగా పడుకుందామని ..." అన్నాడు రామకోటి.

"అఖ్ఖర్లేదు. నువ్వెళ్ళు ... నాకేం భయంలేదు." అనేసి వాణ్ణి పంపించి లైటార్పి వచ్చి మళ్ళీ బెడ్ మీద వాలిపోయాను.

నేను బలహీనుణ్ణి కానందుకు ... జీవితంలో ఓడిపోనందుకూ... నన్ను నేను కన్‌గ్రాట్యులేట్ చేసుకున్నాను.

మళ్ళీ అలాంటి దుర్భరమైన కలేదీ రాకూడదు భగవాన్ అనుకుంటూ బెడ్ మీద పడుకున్న నేను గట్టిగా కళ్ళు రెండూ మూసుకున్నాను.

(జనవరి 79 ప్రభవ మాసపత్రిక)